క్లుప్తంగా

నేడు ఉపాధిహామీ పనులపై ఓపెన్‌ఫోరం

పెన్‌పహాడ్ : మండలంలో 01.04.2022 నుంచి 31.03.2023 వరకు ఉపాధిహామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సామాజిక బృందాలు చేపట్టిన తనిఖీలో భాగంగా తుది నివేదిక సమర్పించడానికి ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, కూలీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నాగారం : మండలంలోని మామిడిపల్లి గ్రామంలో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.15లక్షలతో సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అంబటి శ్రీను, మాజీ ఉపసర్పంచ్ దాసరి అవిలయ్య, పేరాల ఈశ్వర్, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న అధికారి భుజంగరావు

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని ఏనుభాముల గ్రామానికి చెందిన పసునూరి వెంకన్న ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. దీంతో గీత కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.25వేల బీమా చెక్కును అతడి కుటుంబానికి అధికారి భుజంగరావు బుధవారం అందజేశారు. ఆయన వెంట కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్బగాని భిక్షం, జిల్లా సహాయ కార్యదర్శి తండా రమేష్, సభ్యులు సైదులు, జలగం మల్లేష్, బట్టిపెల్లి ఫాల్గుణ, అండెం వెంకన్న, వత్సవాయి నరేష్, గంపల సుందర్, సర్వయ్య, లింగయ్య, అంజయ్య, వెంకన్న పాల్గొన్నారు.

చెరువులో పూడికతీత పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఉపేందర్

అర్వపల్లి : ఉపాధిహామీలో భాగంగా అర్వపల్లిలో జరుగుతున్న చెరువు పూడికతీత పనులను మండల ఏపీఓ చిలుక ఉపేందర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఉపాధి పనులు చేసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం పనులు చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేయాలన్నారు. ఆయన వెంట టీఏ దీపిక, ఫీల్డ్‌అసిస్టెంట్ మల్లయ్య, మేట్లు, కూలీలు ఉన్నారు.

కిశోర్‌కుమార్‌కు గోదావరి కళా దర్బార్ పురస్కారం



పురస్కారం అందజేస్తున్న ఏపీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాలకృష్ణ

నల్లగొండ టౌన్ : సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న నల్లగొండ పట్టణానికి చెందిన డాక్టర్ పల్లె కిశోర్‌కుమార్ గోదావరి కళా దర్బార్–2024 జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఏపీలోని రాజమహేంద్రవరంలో బుధవారం గోదావరి కళా దర్బార్ 2024 జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ఏపీ బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ భరత్‌రాం, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీ సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన బాల్నె పరమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బుధవారం తెలంగాణ ఉద్యమకారుడు, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వాణిశ్రీకాంత్‌రాజ్ పంపిన ఆర్థిక సాయం, బియ్యాన్ని స్థానిక సభ్యులు మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లుగౌడ్, విజయ్‌కుమార్, కరుణకుమార్, శిగ రవికుమార్, జలేందర్ ఉన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు క్రాసింగ్‌లు

- సూర్యాపేట– జనగామ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు
- తిరుమలగిరి మున్సిపాలిటీ 4కి.మీ పరిధిలో 20కి పైగా యూటర్న్‌లు
- కానరాని సూచిక బోర్డులు, సిగ్నళ్లు
- మృత్యువాత పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు





తిరుమలగిరిలో ప్రమాదకరంగా మారిన క్రాసింగ్‌లు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మీదుగా వెళ్లే సూర్యాపేట– జనగామ 365జాతీయ రహదారి మృత్యుమార్గంగా మారుతుంది. ఈ మార్గంలో రోడ్డు క్రాసింగ్‌లు ప్రమాదకరంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ జాతీయ రహదారులపై క్రాసింగ్‌ల వద్ద రహదారి అధికారులు ఏలాంటి సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు జీబ్రా క్రాసింగ్‌లు, సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రతిరోజు ఏదో ఒకచోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రహదారి తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో 4కి.మీ వరకు ఉండగా అందులో 20కి పైగా క్రాసింగ్‌లు ఉన్నాయి. ఈ క్రాసింగ్‌ల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రతిరోజు ప్రమాదం జరుగుతూనే ఉంది. ప్రధాన క్రాసింగ్ వద్ద కనీసం స్టాపర్స్ కూడా ఏర్పాటు చేయలేదు. రహదారిపై నిత్యం వందలాది వాహనాలు వేగంగా వెళ్తుండడం, క్రాసింగ్‌ల వద్ద ద్విచక్రవాహనదారులు, బాటసారులు ఒకేసారి యూటర్న్ తీసుకొని రోడ్డు మీదకు వస్తుండటంతో ఎదురుగా వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొట్టడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలుమార్లు వాహనదారులు మృత్యువాత పడిన సంఘటనలు కూడా లేకపోలేదు.

పది మందికి పైగా మృత్యువాత..

మున్సిపాలిటీలోని 4కి.మీ. పరిధిలో క్రాసింగ్‌ల వద్ద ఇప్పటికే పది మందికి పైగా మృత్యువాత పడ్డారు. ఈ ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా శాశ్వత పరిష్కారం కోసం మాత్రం ఇప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అవసరం లేని చోట ఉన్న క్రాసింగ్‌లను శాశ్వతంగా మూసివేయాలని, నిత్యం ప్రమాదాలను చోట్లను గుర్తించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని, ప్రధాన క్రాసింగ్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు, స్టాపర్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదాలకు నివారణ చర్యలు తీసుకుంటాం



“365జాతీయ రహదారిపై అవసరం లేని క్రాసింగ్‌లను మూసివేస్తాం. ప్రమాదాలకు అవకాశం ఉన్న చోట స్టాపర్లను ఏర్పాటు చేస్తాం. యూటర్న్ తీసుకునే సమయంలో వాహనదారులు కూడా ట్రాఫిక్ రూల్స్, జాగ్రత్తలు పాటించాలి. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

– కె.సత్యనారాయణ, ఎస్‌ఐ తిరుమలగిరి

అవసరం లేని క్రాసింగ్‌లను మూసివేయాలి



“తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 20కి పైగా క్రాసింగ్‌ల వద్ద ప్రతిరోజు ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. క్రాసింగ్‌ల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అవసరం లేని చోట క్రాసింగ్‌లను మూసివేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– సంకెపల్లి కొండల్‌రెడ్డి, తిరుమలగిరి

సోషలిస్ట్ విప్లవాన్ని సాధించిన గొప్పవ్యక్తి లెనిన్



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరిరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రపంచంలో మొదటిసారిగా కార్మికవర్గ నాయకత్వాన సోషలిస్ట్ విప్లవాన్ని సాధించిన గొప్పవ్యక్తి లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. ఫిబ్రవరి 21న కమ్యూనిస్టు ప్రణాళిక ఆవిర్భవించిన రోజు సందర్భంగా బుధవారం పట్టణంలో ×లెనిన్ ఓ విప్లవ ఆయుధం₹ అనే పుస్తకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సృజనాత్మకంగా ఆచరిస్తూ బూర్జువా వర్గంపై విప్లవ బావుట ఎగురవేసిన వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. పెట్టుబడిదారి వర్గం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజలు, కార్మికులు ఉద్యమాలకు రావాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, జిల్లా నాయకులు వేల్పుల వెంకన్న, పులుసు సత్యం, దండా వెంకటరెడ్డి, వీరబోయిన రవి, రాంబాబు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

మద్దిరాల : మండల కేంద్రానికి చెందిన గోల్కొండ రాజమల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గ్రామానికి చెందిన వల్లపు రమేష్‌యాదవ్ బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబానికి 50కేజీల బియ్యం అందజేశారు. ఆయన వెంట వల్లపు అవిలయ్య, భూతం చలం, పాక సోమలింగం, మందుల వెంకన్న, రవి, ఎష్రోబ్, అశోక్, లింగయ్య, అబ్బయ్య ఉన్నారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులు తదితరులు ఉన్నారు.

ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు..

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గొట్టిపర్తి వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఇమ్మడి సోమనర్సయ్య, గజ్జి ఉపేందర్, సంతోష్, బుక్క లక్ష్మయ్య, తునికిపాటి రాంబాబు, రాపాక సోమేష్, ఉమ్మడి సంతోష్, అర్చకులు రఘువర్ధన్, మాటూరి రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడంతో బుధవారం వారిని కళాశాల ప్రిన్సిపల్ కె.వెంకటేశులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన ఎస్.ప్రవళిక ఫైనల్ ఇయర్ ఎంఎస్సీ ఫిజిక్స్‌లో, డి.అజయ్‌కుమార్ బీఎస్సీ బీజెడ్సీలో 2023లో అత్యధిక మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారికి ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 83వ ఆలిండియా ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్ ముగింపులో ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్, ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నట్లు తెలిపారు.

‘పది’ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి



వివిధ శాఖల అధికారులు, హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

అర్వపల్లి : త్వరలో జరిగే పదోతరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, హెచ్‌ఎంలతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమర్థంగా పరీక్షలను నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఎలాంటి వత్తిడికి గురికావద్దని కోరారు. సమావేశంలో ఎంఈఓ బాలునాయక్, ఎంపీడీఓ సందీప్‌కుమార్, హెచ్‌ఎంలు,అధికారులు పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ చేయకపోవడం హేయమైన చర్య



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్దిరాల : గొల్లకుర్మలకు గత ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని హడావుడి చేసిందే తప్ప ఇప్పటికీ పంపిణీ చేయకపోవడం హేయమైన చర్య అని గొర్రెల మేకల పెంపకదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్యయాదవ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టిపెల్లి మల్లేష్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రలోని తహసీల్దార్ కార్యాలయంలో గతంలో రెండో విడత గొర్రెల కోసంరూ.45వేలను డీడీల రూపంలో అందజేసిన నగదును తిరిగి ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపోయిన గొల్లకుర్మలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకందారుల సంఘం మండల అధ్యక్షుడు గుండాల లింగయ్యయాదవ్, పచ్చిపాల వెంకన్న, కసనబోయిన లింగయ్య, భూతం వీరన్న, చలం, వల్లపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ నూతన కమిటీ ఎన్నిక

నాగారం : మండలంలోని నర్సింహులగూడెంలో బుధవారం యూత్ కాంగ్రెస్ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా కంబాల మల్లేష్, ఉపాధ్యక్షుడిగా వేముల సాయి, ప్రధాన కార్యదర్శిగా ధరావత్ సురేందర్, కార్యదర్శిగా పొర్ల యుగేందర్, కోశాధికారిగా ధరావత్ సుమన్, సహాయ కార్యదర్శిగా ధరావత్ శ్రీకాంత్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మెరుగు సతీష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్మకంటి సోమన్న సభ్యులకు నియామకపత్రాలను అందజేశారు.

నల్లగొండలో బీజేపీ గెలుపొందడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న మన్మథరెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ నుంచి బీజేపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కోకన్వీనర్ తుక్కాని మన్మథరెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా తాను టికెట్ ఆశిస్తున్నానని, గత కొన్ని సంవత్సరాలుగా పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నానని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు ఆశీస్సులతో తనకు టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బూర మల్సూర్‌గౌడ్, దోసకాయల ఫణినాయుడు, గద్దల గణేష్, జటంగి ఉపేందర్, గుణగంటి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు



స్వామి, ఆళ్వారుల విగ్రహాలను ఊరేగిస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం స్వామి, అమ్మవార్లను దేవరాజ వాహనంపై, ఆళ్వార్లను పల్లకిలో ఉంచి ఆలయంలోని మాఢవీధుల్లో ప్రదక్షిణలు చేశారు. అలాగే అర్చకులచే వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. నర్సింహస్వామి విశేషార్చన, సేవాకాలం, అధ్యయనోత్సవం, పఠనం జరిపారు. కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, ధర్మకర్త రత్నం లక్ష్మాజీ, ఈఓ వై.శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరెడ్డి, బైరబోయిన మహరాజు, రాగి అనిల్, కోటిప్రసాద్, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, స్థానాచార్యులు జియర్ వెంకటనర్సింహాచార్యులు, తులసి భరతాచార్యులు, కుంతిపురం వరదాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పెన్‌పహాడ్ : విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆర్బీఎస్‌కే బృందం వైద్యాధికారి కె.పార్వతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్బీఎస్‌కే బృందం సభ్యులు విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై తగు సూచనలు, సలహాలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 8, 9, 10తరగతి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నకిరేకంటి రవి, ఫార్మసిస్టు అనూష, ఏఎన్‌ఎం స్వప్న, ఉపాధ్యాయులు జమాల్ షరీఫ్, ఉపేందర్, రఫీయా, రామకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



తుంగతుర్తి : స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



అర్వపల్లి : పర్సాయపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని డీఆర్‌ఆర్‌ఎం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో, శ్రీ విద్యాభారతి ఉన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయుల పాత్రలను పోషించి పలువురిని అలరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల డైరెక్టర్లు వర్దెల్లి శ్రీకాంత్, ఎండీ నజీరోద్దీన్, మల్లయ్య, వెంకటగోపాల్, ఉపాధ్యాయులు స్వాతి, రేణుక, మమ త, షాహిన, శోభ, అంబటి రమేష్, సురేష్, గోపాల్‌రావు, ఈరోజీ, సంధ్య, సరిత, రాధ, ఉమ, సునీత, స్వప్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని పర్సాయపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులుగా వివిధ పాత్రలు పోషించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కుర్రె శ్రీనివాస్, ఉపాధ్యాయులు మామిడి సురేందర్, కె.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు

నూతనకల్ : విద్యాభివృద్ధి కోసం దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని లింగంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ సహకారంతో స్టడీ మెటీరియల్స్, ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని చేరుకునే విధంగా వారికి స్టడీమెటిరియల్స్ అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, యువజన కాంగ్రెస్ నాయకులు మట్టి నరేష్, కొరివి గంగయ్య, బొల్క సైదులు, మాదాసు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి మీదుగా హైదరాబాద్‌కు బస్సులు నడపాలి

అర్వపల్లి : నకిరేకల్–తానంచర్ల 365హైవేపై సూర్యాపేట, తొర్రూర్, మహబూబాబాద్, ఖమ్మం తదితర డిపోల నుంచి తుంగతుర్తి, అర్వపల్లి, నకిరేకల్‌ల మీదుగా హైదరాబాద్‌కు బస్సులు నడపాలని సీపీఎం నాయకుడు కొప్పోజు యాదగిరి ఆర్టీసీ అధికారులను కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్–తానంచర్ల జాతీయ రహదారిపై కేవలం సూర్యాపేట, హైదరాబాద్–2 డిపోలకు చెందిన రెండు బస్ సర్వీసులను మాత్రమే ఉదయం వేళలో నడుపుతున్నారని, మిగిలిన సమయాల్లో బస్సులు లేక ఈ రూట్లోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ రూట్లలో అనువుగా ఉన్న అన్ని డిపోల బస్సులను నడిపిస్తే ఆర్టీసీకి ఆదాయం చేకూరడంతో పాటు ప్రజల ఇబ్బందులు తీరనున్నాయని తెలిపారు.

క్రమశిక్షణతో చదివితే విజయం సాధ్యం



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

తుంగతుర్తి : విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే విజయం సాధ్యమవుతుందని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ ప్రిన్సిపల్ శ్యామలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన పదోతరగతి, ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులమని భయపడకుండా చదువుపై శ్రద్ధ చూపి ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఇటీవల ప్రకటించిన గురుకుల ఫలితాల్లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించిన గడ్డం రవి, పీజీ టీచర్‌గా ఎంపికైన ఇస్లావత్ మహేందర్‌ను బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం దామర శ్రీనివాస్ మాట్లాడారు. కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించిన పూర్వవిద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, ఉపేంద్ర, హకీమ్, జానయ్య, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ఓ చరణ్

అర్వపల్లి : మార్చి 3,4,5 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎల్.చరణ్ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పల్స్‌పోలియో కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలంలో 2,064 మంది 0నుంచి 5ఏళ్లలోపు చిన్నారులు ఉన్నారని, 12 బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు. 3న బూత్‌లలో, 4, 5తేదీల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, డాక్టర్ నగేష్, ఎంఈఓ బాలునాయక్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు విరాళం

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు మండల పరిధిలోని కోడూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి – చైతన్య దంపతులు బుధవారం ఉత్సవ కమిటీకి రూ.లక్ష విరాళం అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన వీరెల్లి వెంకట్‌రెడ్డి రూ.50వేలు, మారోజు బ్రహ్మాచారి రూ.50వేల విరాళాలను అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందజేసినట్లు వారు పేర్కొన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మొరపాక సత్యం, మాజీ సర్పంచ్ గుయ్యని బాబు, కోమటి సోమయ్య పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న సామ అభిషేక్‌రెడ్డి